కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



కౌంటింగ్ సిబ్బంది శిక్షణకు హాజరైన అధికారులు

- 22 రౌండ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు
- 28 టేబుళ్లు ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారులు
- లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత

కుత్బుల్లాపూర్: ఎన్నికల కౌంటింగ్ ఈనెల 4వ తేదీ (మంగళవారం) ఉదయం 8గంటల నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పోలైన మొత్తం 3,63,874 ఓట్లను 22 రౌండ్లల్లో, 28 టేబుళ్లపై లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. రాజకీయ పార్టీలు తమ తమ ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రంలో ఉదయం 7గంటలలోపు పంపేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఉన్నప్పటికీ ఇటీవల వెలువరించిన సర్వేల ప్రకారం బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉందని పలు సర్వే సంస్థలు సైతం తేల్చిచెప్పాయి.

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ...

ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బోగారంలోని హోలీమేరి కాలేజీలో సిబ్బందికి ఇచ్చిన శిక్షణలో ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పులిసైదులు, ఈఆర్‌ఓ నర్సింహులు, నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణారావు, బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, దండిగల్ గండిమైసమ్మ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

కిలోమీటర్ దూరంలోనే అనుమతి..

◆ కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. కౌంటింగ్ కేంద్రం నుంచి సుమారు కిలోమీటరు దూరంలోనే పాసులు ఉన్నవారికే అనుమతించే విధంగా అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు మూడంచెల భద్రతను సైతం ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొంటున్నారు. ఎన్నికల ఫలితం తరువాత ఎక్కడ ఎలాంటి ఘర్షణ వాతవారణం కనిపించకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నామని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

బీఆర్‌ఎస్‌కు భారీ గండి..!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఓట్లు లభించాయి. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కేపీ వివేకానంద్‌కు 85వేల పైచిలుకు మెజారిటీ లభించింది. కాని మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్,బీజేపీలో చేరారు. దీంతో బీఆర్‌ఎస్‌కు భారీ నష్టం జరిగింది. అంతే కాకుండా గతంలో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసిన ఓటర్లు సైతం జాతీయ స్థాయి ఎన్నికలు కావడంతో ఆ కోణంలోనే ఓటు వేసినట్లు తెలుస్తోంది. అంటే బీజేపీ, కాంగ్రెస్‌ల వైపు మొగ్గు చూపినట్లు అర్థం అవుతోంది. అయితే ఈ ఓటు బ్యాంకు ఎవరికి కలిసి వస్తుందోననేది మాత్రం ఈరోజు తేలనుంది.



రోడ్లపైనే స్క్రాప్

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ఆగని రీసైక్లింగ్ యూనిట్ నిర్వాహకుల ఆగడాలు

జీడిమెట్ల: స్క్రాప్, రీసైక్లింగ్ యూనిట్‌ల నిర్వాహకులకు ఆగడాలకు అంతులేకుండా పోతోంది. కనీసం రోడ్డును సైతం వదలకుండా పాత సామాన్లు రోడ్లపై నిల్వచేసి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్‌లో ఇళ్ల మధ్యలో కొంతమంది రీసైక్లింగ్ యూనిట్‌లను నడుపుతున్నారు. వీరంతా వివిధ పరిశ్రమల నుంచి కొనుగోలు చేసిన పాత సామాన్లలను రోడ్డును అక్రమించి నిల్వ చేస్తున్నారు.

◆ దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వారి యూనిట్‌లకు వచ్చే వాహనాలను రోడ్డుపై నిలిపి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండటంతో ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయమై వెంకటాద్రినగర్ కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు ఎందుకు?

◆ ప్రజలకు సమస్య కలిగినపుడు నేరుగా ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజల సొమ్మును వేతనంగా తీసుకుని ప్రజల కోసం పనిచేయాల్సిన అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కనీసం రోడ్డుపై ఉన్న సామాన్లను తీసివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమని కాలనీవాసులు అంటున్నారు.

◆ మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చే కిందిస్థాయి సిబ్బంది అక్కడకు వచ్చి తూతూ మంత్రంగా హడావిడి చేసి వారిచ్చే అమ్యామ్యాలు తీసుకుని వెళ్లిపోతున్నారని కాలనీప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్లను అక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కుల కోసం ఎంత వరకైనా పోరాడతానని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు అన్నారు. సోమవారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పలు కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు నాగరాజును ఆయన నివాసంలో కలిశారు. యాజమాన్యాలు తమకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నాగరాజు మాట్లాడుతూ.. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రమోద్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన అన్ని సదుపాయలను పొందేందుకు యాజమాన్యాలతో చర్చిస్తానన్నారు. కార్మికులు వెంకటరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మి, రాము, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా రవిశంకర్‌రావు


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన బొడ్డు రవిశంకర్‌రావు

కుత్బుల్లాపూర్: తెలంగాణ కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా బొడ్డు రవిశంకర్‌రావు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్రంలోని 43 కమ్మ సంఘాలు పాల్గొని ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఉండగా ఆయన స్థానంలో నూతనంగా రవిశంకర్‌ను ఎన్నుకున్నారు. సోమవారం సంఘం సభ్యులతో కలిసి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, బండి రమేష్, బిక్కసాని నాగేశ్వర్‌రావు, బొబ్బా రంగారావు, దిలీప్ చౌదరి, వెంకటేశ్వరరావు, గంగాధర్, బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌టాప్ అప్పగింత

బంజారాహిల్స్: ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌ట్యాప్‌ను పోలీసులు ట్రేస్ చేసి బాధిత సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని చెంతకు చేర్చారు. రమ్య అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆదివారం తన కుటుంబసభ్యులతో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి ఆటోలో వచ్చింది. అయితే ఆటోలోనే ల్యాప్‌ట్యాప్‌తో పాటు ఇతరత్రా తన వస్తువులు కలిగిన బ్యాగ్‌ను మరిచిపోయింది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురాగా సీసీ కెమెరాల ఆధారంగా ఆటోడ్రైవర్‌ను గుర్తించి బ్యాగ్‌ను రమ్యకు అప్పగించారు. డీఐ దామోదర్ నేతృత్వంలో క్రైమ్ సిబ్బంది శంకర్, వివేక్‌లు బ్యాగ్‌ను బాధితురాలికి అప్పగించడంలో కీలకపాత్ర పోషించారు.

నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

చింతల్: భగత్‌సింగ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు సాంబయ్య, సామ్రాట్, చందు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టి.లక్ష్మారెడ్డి, భగత్‌సింగ్‌నగర్ ప్రధాన కార్యదర్శి సత్యం, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్యాంబాబు, స్వామి, ప్రేమ్‌కుమార్, పూర్ణచంద్ర తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు 21వ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్(ఐసీఎస్ఏ)–2024 పేరిట సదస్సును నిర్వహిస్తారు.మంగళవారం నుంచి 8 తేదీ వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. ఈ సదస్సుకు ట్రిపుల్‌ఐటీ ఎస్ఈఆర్‌సీ నుంచి డాక్టర్ వై రఘురెడ్డి, యూఎస్ఏలోని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ నెనాద్ మెద్విడోవిక్ అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 150 మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్ర నుంచి కొంపల్లికి వెళ్లే రోడ్డులోని టీఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో సోమవారం ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సదరు వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. అతని వయసు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవలను విస్తృతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలను మరింతగా విస్తృతం చేస్తూ పేద ప్రజల హితం కోసం పని చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు వి.నాగభూషణం అన్నారు. మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో వీఎస్‌టీ రోడ్డులో గత 54 రోజులుగా నిర్వహించిన ఉచిత మజ్జిగ, చలివేంద్రం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభూషణం మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పని చేస్తున్న మాతావాకర్స్ క్లబ్‌ను స్ఫూర్తిగా తీసుకోని పని చేయాలని సూచించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవలు అందిస్తున్న అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తోంది

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు




జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేమి.. అనుభవ రాహిత్యంతో ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను సోమవారం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

◆ ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ... సమైక్య పాలకుల పాలనలో తెలంగాణ ప్రాంతం నీళ్లు, నిధులు, నియామకాల్లో అడుగడుగునా వివక్షకు గురైందన్నారు. ఈ వివక్షను వ్యతిరేస్తూ కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహారదీక్షతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. బీడు భూములతో వెనుకబడిన తెలంగాణ ప్రాంతాన్ని పదేళ్ల కాలంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధితో బంగారు తెలంగాణగా మార్చారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మరిచి పేర్లను, లోగోలను మారుస్తూ కాలం గడిపేస్తుందన్నారు. అనంతరం పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.

సెల్లార్లలో అదనపు నిర్మాణాలు చేపట్టొద్దు

కుత్బుల్లాపూర్: పాత భవనాలు, అపార్ట్‌మెంట్ల సెల్లార్లలో ఎటువంటి మరమ్మతులు, అదనపు నిర్మాణాలు చేపట్టొదని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సుచిత్రలోని ఓ ఆపార్ట్‌మెంట్ సెల్లార్‌లో గోడ కూలి ఓ కార్మికుడు ఇరుకున్న ఘటన నేపథ్యంలో సెల్లార్ల నిర్మాణాలపై నోటీసులు జారీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఎవరైనా అపార్ట్‌మెంట్ సెల్లార్లలో పనులు చేయిస్తే ఎద్దైనా ప్రమాదం చోటు చేసుకుంటే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీఎంకు సత్కారం

లిబర్టీ: రాష్ట్రాన్ని ప్రగతి పదం వైపు నడిపిస్తున్న తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద సత్కరించారు. సోమవారం ఆయనను కలిసి దళితుల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినత పత్రం సమర్పించి ఆత్మీయ సత్కారం చేశారు. గడిచిన ఆరు నెలల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రగతి పథకం వైపు తీసుకెళ్తుందని తెలిపారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నేలకొరిగిన చెట్ల తొలగింపు


ఈదురు గాలులకు కూలిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: వర్షానికి కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి భారీ వృక్షాలు నేలకూలాయి. ఈ నేపథ్యంలో సోమవారం అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయంతో రోడ్లపై చెట్లను తొలగించారు. రుక్మిణి ఎస్టేట్స్, గాయత్రినగర్, మహానగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, భాగ్యలక్ష్మికాలనీ, మీనాక్షి ఎస్టేట్స్, గంగా ఎన్‌క్లేవ్‌కాలనీ తదితర ప్రాంతాల్లో విరిగిపడిన 30 వరకు చెట్లను తొలగించి స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.

19న సదస్సు

పంజగుట్ట: సమతా ధ్యాత్మిక మూర్తి అన్నమయ్య జయంతి సందర్భంగా 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకావిష్కరణ, ద్వేషం, అసమానత్వాలకి వ్యతిరేకంగా హిందూమతం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర స్వామి తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ అధ్యక్షుడు శ్రీ సాధు త్రినాథ దాస్, బిర్లామందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఈ నెల 19వ తేదీన అన్నమయ్య జన్మదినం సందర్భంగా హైదరాబాద్ బిర్లా సైన్స్‌సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్లాంట్ ఏ ట్రీ మై ఫ్రెండ్స్


సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో పీఏటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న చిన్నారులు

కుత్బుల్లాపూర్: ప్లాంట్ ఏ ట్రీ మై ఫ్రెండ్స్ (పీఏటీ) ఆధ్వర్యంలో మంగళవారం సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో చిన్నారులు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పీఏటీ మెంబర్లు ఆరీవ్ కే రావ్, ఆరోహి నాయక్, శ్రీధా గౌడ్, అనన్యశివ్ మాట్లాడారు. నగర వ్యాప్తంగా అర్బన్ ఫారెస్ట్‌ను పెంపొందించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తమకు జీహెచ్ఎంసీ, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్లు సహాయ సహకారాలు అందిస్తున్నాయని తెలిపారు. రోడ్లు పక్కన మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తున్నామని అన్నారు. వచ్చే మూడు రోజుల్లో 100కు పైగా మొక్కలను నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న

హఫీజ్‌పేట్: వర్షాకాలం దృష్ట్యా మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ముందు ఉన్న యూ టర్న్‌ను కూకట్‌పల్లి ఏసీపీ వెంకటయ్యతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ చౌరస్తా నుంచి సీఆర్ ఫౌండేషన్ వరకు ఉన్న యూ టర్న్‌ల వద్ద నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాకుండా రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించామన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. రోడ్డుపై ఉన్న గుంతలకు తాత్కాలిక మరమ్మతులను కూడా చేయించామన్నారు.

ఉరేసుకొని గృహిణి ఆత్మహత్య


మృతి చెందిన రాణి

హఫీజ్‌పేట్: ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలంలోని సున్నిపెంటకు చెందిన కె.రాణి (34), ప్రకాశం జిల్లా మార్టూర్‌కు చెందిన కె.దినేష్‌కు 2008వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరు శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీలో నివాసముంటున్నారు. దినేష్ క్యాబ్ డ్రైవర్. వీరికి ముగ్గురు సంతానం కాగా ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి ఉన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి దినేష్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తనను నిత్యం వేధిస్తున్నాడని ఆమె తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు అతనిని మందలించారు. ఈ క్రమంలో కొన్ని నెలలు బాగానే ఉన్నాడు. మరలా తీరు మారకపోవడంతో రాణి గొడవకు దిగింది. ఎంత చెప్పిన భర్త వినడంలేదని సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంట్లో అందరు నిద్రపోయిన సమయంలో ఉరివేసుకొంది. ఆమె కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో రాణి తల్లిదండ్రులు వచ్చి చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కబ్జా ప్రహరీ వదిలేసి.. అనుమతుల ప్రహరీ కూల్చి.!

కొంపల్లి మున్సిపల్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం




నాలాపై వెలిసిన ప్రహరీని కూల్చివేస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: తుమార్ చెరువు అలుగు నాలా కబ్జాపై ఎట్టకేలకు అధికారులు స్పందించి తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమార్ చెరువు దిగువ భాగాన అలుగు, తూము కట్టు కాలువ కబ్జాపై మే 29న 'నాలాపై వెలసిన నిర్మాణాన్ని తొలగిస్తాం'అనే శీర్షికన 'సాక్షి'ప్రచురితమైన గురించి తెలిసిందే. దీనిపై స్పందించిన ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం ఏడబ్ల్యూఈ నిఖిత, ఏఈ హర్షత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భారతి, మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకుని నాలాపై వెలసిన నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేత పనులు చేపట్టారు. ముందుగా గ్రామస్తులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు తరలివచ్చి ఎగువ ప్రాంతమైన మైసమ్మగూడలోని కాలేజ్ హాస్టల్ నుంచి మురుగునీరు చెరువులోకి వచ్చి చేరడం వల్ల చెరువు మొత్తం కలుషితంగా మారిందని అధికారులకు వివరించారు.

◆ ఆదేవిధంగా చెరువు దిగవ భాగాన కట్టు కాలువ కబ్జా విషయమై అధికారులకు వివరించారు. అనంతరం పోలీస్ భద్రత మధ్య సర్వే నంబర్.2లో కొంత ప్రహరీని కూల్చివేశారు. దిగువ భాగాన సర్వేనం.4లో మరో వ్యక్తి 60 మీటర్ల మేర కాలువను కలుపుకుని ప్రహరీ నిర్మాణం చేపట్టగా అది కూడా కూల్చాలని స్థానికులు పట్టుబట్టారు. అధికారులు ఆ నిర్మాణాన్ని కూడా కూల్చివేస్తామని చెప్పడంతో శాంతించారు. మధ్యాహ్నం తర్వాత ఆ ప్రహరీ జోలికి వెళ్లకుండా వెళ్లిపోయారు. చెరువు తూము నుంచి వెళ్లే కట్టు కాలువ 2 మీటర్లు ఉంటుందని ఆ కాలువపై వెలిసిన నిర్మాణాన్ని తొలగిస్తామని చెప్పి ఆ నిర్మాణం తొలగించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ నాలా జోలికి మాత్రం వెళ్లలేదు...

◆ అలుగు నుంచి వెళ్లే ప్రధాన కట్టు కాలువ కబ్జాపై స్థానికంగా ఉన్న గ్రామస్తులు ప్రశ్నించగా అధికారులు మాత్రం ఆ నాలా జోలికి మాత్రం వెళ్లలేదు. తూము నుంచి వెళ్లే నాలాపై కొంత మేర కూల్చివేసి వెళ్లిపోగా వర్షం పడినప్పుడు అక్కడి వరకు వచ్చిన వర్షపునీరు దిగువ ప్రాంతానికి ఎలా వెళ్తాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కబ్జా చేయకున్నా ప్రహరీని కూల్చారు..



సర్వే నం.2లో మా స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నాం. పక్కన ఉన్న మరికొందరు వ్యక్తులు సదరు కట్టు కాలువను కబ్జా చేసి తమ స్థలంలోకి కలుపుకున్నారు. కానీ అధికారులు మాత్రం ఎలాంటి సర్వే చేయకుండా నాలా మా స్థలంలోకి రాకున్నా ప్రహరీని కూల్చివేశారు. కానీ మా దిగువన ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. ఇక అలుగు నాల సర్వే నంబర్ ఒకటి మీదుగా వెళ్లే కట్టు కాలువ కబ్జాకు గురైనా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. – సతీష్‌చంద్ర

జల్సాలకు అలవాటుపడి బైక్ చోరీలు

హిమాయత్‌నగర్: జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తితో పాటు మైనర్‌ను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుండి దొంగిలించిన ఒక ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. గత నెల 22న బర్కత్‌పురా ప్రాంతానికి చెందిన అర్కపల్లి శిథిరాజు తన ఇంటి ముందు పార్క్ చేసిన టీవీఎస్ బైక్ కనిపించడం లేదంటూ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు, రాంకోఠి చౌరస్తాలో వాహన తనిఖీలలో అంబర్‌పేట్‌కు చెందిన సిమోన్ రాజ్, నాంపల్లికు చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడు దొంగతనానికి గురైన బైక్‌తో పట్టుపడ్డారు. వారిని విచారించగా ఆ బైక్‌ను దొంగలించినట్లు ఒప్పుకున్నారు.నిందితులు సిమోన్ రాజ్ వాల్ పెయింటింగ్, మైనర్ బాలుడు మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి వచ్చే డబ్బులు సరిపోక ఇలా దొంగతనాలు చేస్తూ , జల్సాలు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సిమోన్ రాజ్ గతంలో నారాయణగూడ , అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, బెయిల్ పై బయటకి వచ్చి ఇలా దొంగతనాలు చేస్తున్నట్లు ఏసీపీ శంకర్ తెలిపారు. వారి పై కేసు నమోదు చేసి సిమోన్ రాజ్‌ను రిమాండ్‌కు, మైనర్ బాలుడిని జ్యూవెనల్ హోమ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.